
# ఇంటర్మీడియట్ విద్యార్థులకు వనమా వాసు శుభాకాంక్షలు



**ఖమ్మం/ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా ఖమ్మం జిల్లా విద్యార్థినీ, విద్యార్థులందరికీ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు వనమా వాసు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రియమైన విద్యార్థులారా పరీక్షలు అనేవి మీ ప్రతిభను నిరూపించుకునే కీలకమైన అవకాశం. భయం, ఆందోళనలకు తావు ఇవ్వకుండా ప్రశాంత మనస్సుతో పరీక్షలకు హాజరవ్వండి. మీరు కష్టపడి చదివిన పాఠాలపై నమ్మకం ఉంచండి. క్రమశిక్షణ, ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించండి" అని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు మీపై ఉంచిన ఆశలు నెరవేర్చడమే కాకుండా ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వనమా వాసు తెలిపారు.

# డిఫాల్ట్ రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు

## 24 కోట్లకు పైగా బకాయిలు- కఠిన చర్యలు తప్పవు: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం/ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ ధాన్యం కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్)లో ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించి కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా డిఫాల్ట్ చేసిన రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిధుల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం మంగలగూడెం గ్రామానికి చెందిన శ్రీ సత్యనారాయణ సిల్కీ సార్టెక్స్ రైస్ మిల్ యాజమాన్యం 202122 ఖరీఫ్, 202223 ఖరీఫ్, రబీ, 202324 ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని పూర్తిగా అందజేయకుండా 9.49 కోట్ల రూపాయల అసలు బకాయి కలిగి ఉందని తెలిపారు. పెనాల్టీలతో కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం 13.84 కోట్లకు చేరిందన్నారు. ఈ మిల్లు మేనేజింగ్ భాగస్వామి కన్నేటి జ్యోతి, భాగస్వామి మామిడాల మానసపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ నెం.129/2026 నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్ 202223 ఖరీఫ్, రబీ సీజన్లలో 7.59 కోట్ల రూపాయల అసలు బకాయి కలిగి ఉండగా, పెనాల్టీలతో కలిపి 10.88 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మిల్లు యజమాని మేకల రామారావుపై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ నెం.47/2026 నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం, ప్రజాధనం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని, డిఫాల్ట్ చేసే మిల్లర్లపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. బకాయిల వసూలు ప్రక్రియను వేగవంతం చేస్తూ సంబంధిత శాఖల ద్వారా తదుపరి విచారణ కొనసాగుతున్నదని తెలిపారు.

# ఫుట్‌పాత్ వ్యాపారులకు లయన్స్ క్లబ్ చేయూత

### చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ





**సత్తుపల్లి/ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో రోడ్ల వెంట వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు నిలువనీడ కల్పించేందుకు సత్తుపల్లి లయన్స్ క్లబ్ ముందుకు వచ్చింది. బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకుంది. ఎండల వేడిని తట్టుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న చిన్నచిన్న వ్యాపారులకు ఈ గొడుగులు ఉపశమనం కలిగిస్తాయని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అభివృద్ధి, విస్తరణ విభాగం (జీఈటీ) బాధ్యులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, సత్తుపల్లి జోన్ చైర్మన్ రమేష్, క్లబ్ అధ్యక్షులు గోగడ రమేష్, జంగా సత్యనారాయణ, లయన్స్ క్లబ్ మేధా విభాగం బాధ్యులు పసుపులేటి నాగేశ్వరరావు, మిద్దె శ్రీను, వలి తదితరులు పాల్గొన్నారు.

# సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధి 2014లోనే నిర్ణయం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్, ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త);** హైదరాబాద్ లోని మాదాపూర్ లో ఉన్న సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు . సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధి 2014లోనే నిర్ణయించబడిందని స్పష్టం చేశారు. ఒకసారి ఫిక్స్ చేసిన ఎఫ్‌టీఎల్ పరిమితుల్లో మార్పులు, చేర్పులు ఉండవని వెల్లడించారు రంగనాథ్. ఎఫ్‌టీఎల్ హద్దులను 5 ఎకరాలు మినహాయించి మార్చుతున్నారన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలు నిరాధారమని ఖండించారు. హైకోర్టు ఆదేశాల మేరకే సున్నంచెరువు ఎఫ్టీఎల్ పరిధిలో పనులు జరుగుతున్నాయని అన్నారు. సున్నం చెరువు దగ్గర గతంలో వేసిన ఫెన్సింగ్‌లో ప్రభుత్వ భూమి కలిసివున్నా, అది ఎఫ్‌టీఎల్‌కు వర్తించదని అన్నారు రంగనాథ్. చెరువు చెంత ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకుని పార్కులు, ప్లే ఏరియాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట సహా మొదటి విడతలో చేపట్టిన 6 చెరువుల దగ్గర ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు రంగనాథ్. గతంలో హైడ్రా చర్యలకు సహకరించిన ఎమ్మెల్యే అకస్మాత్తుగా విమర్శలకు దిగడం ఆశ్చర్యకరమని అన్నారు. కూకట్‌పల్లి జోన్‌లో భూముల విలువ ఎక్కువగా ఉండటం వల్లే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. హైడ్రాకు వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో సుమారు 40శాతం కూకట్‌పల్లి జోన్ నుంచే వచ్చాయని వెల్లడించారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసర స్థలాలు, ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి పక్షాన కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడేలా హైడ్రా చర్యలు ఉంటాయని.. ఇప్పటివరకు 1,240 చోట్ల ఆక్రమణలు తొలగించి 1,310 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షించామని అన్నారు.

# ఎన్ఎంఎంఎస్‌కు కాకర్లపల్లి విద్యార్థుల ప్రతిభా జ్యోతి

## జిల్లాలోనే అత్యధికంగా 12 మందికి అవకాశం -అభినందించిన ఎంఈఓ, ఉపాధ్యాయులు



**సత్తుపల్లి/ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకానికి ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమైంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి రాజేశ్వరరావు (కాకర్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు) మరియు ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి బలాన్నిస్తుందని తెలిపారు. 8వ తరగతి తర్వాత చదువు మానేయకుండా మెరిట్ విద్యార్థులను గుర్తించి, ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించడం ఈ పథక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఈ ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. తమ పాఠశాల విద్యార్థులు ఖమ్మం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదు అందించిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, మురళీ, రమేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

# పసిబిడ్డ మృతికి కన్నీటి నివాళి..

## దోషులను కఠినంగా శిక్షించాలని కట్ర్యాల గ్రామస్తుల డిమాండ్



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన అమానవీయ కుల వివక్ష, దాడి ఘటనలో రెండేళ్ల పసిపాప ప్రాణాలు కోల్పోవడం యావత్ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ క్రూరమైన ఘటనకు నిరసనగా, బాధిత కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కొండేటి భాస్కర్ మాట్లాడుతూ 79 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కూడా అట్టడుగు వర్గాలపై అగ్రవర్ణ దాడులు కొనసాగుతుండటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిలోకి రానివ్వకుండా, రెండేళ్ల పసిపాప అని కూడా చూడకుండా దాడికి పాల్పడటం మానవత్వమే లేని పని. ఈ ఘటన నాగరిక సమాజం తలదించుకునేలా ఉంది,అని ఆయన మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇకనైనా చైతన్యవంతులు కావాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక వివక్షను రూపుమాపి, కనీస జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, దోషులను కఠినంగా శిక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు ముత్యాల బాబు (కార్యదర్శి), ముత్యాల భాస్కర్ (ఉపాధ్యక్షుడు), ముత్యాల రమేష్ (గౌరవ అధ్యక్షులు), తాటికాయల రాజు (కార్యదర్శి)తో పాటు గౌరవ సలహాదారులు ముత్యాల దీపక్, ఇరుకు శ్రవణ్, ఇరుకు విజయ్, ముత్యాల మదన్ కుమార్, పెద్ద సంఖ్యలో చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పోరాటాల యోధురాలు మైసమ్మ కన్నుమూత..

## నివాళులర్పించిన కమ్యూనిస్ట్ నేతలు





**వర్ధన్నపేట/ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త):** ప్రముఖ రైతు కూలీ సంఘం నాయకులు, దివంగత కమ్రేడ్ కొండేటి చంద్రయ్య సతీమణి మైసమ్మ బుధవారం స్వర్గస్తులయ్యారు. ఆమె మృతి పట్ల మండలంలోని పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆనాటి భూస్వామ్య వ్యవస్థలో కంచె కారులు, భూస్వాముల ఆగడాలను ఎదిరించి, కమ్రేడ్ కొండేటి చంద్రయ్య తో కలిసి మైసమ్మ చేసిన పోరాటాలు అజరామరం. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో వందలాది ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేయడంలో వారు కీలక పాత్ర పోషించారు. భూస్వాముల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన ఆ దంపతులు, పేదల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధిలో మైసమ్మ, చంద్రయ్యల కృషి మరువలేనిది. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు, ఇంటి స్థలం ఉండాలనే లక్ష్యంతో వారు చేసిన ఉద్యమాల ఫలితంగా ఎంతోమందికి స్థలాలు దక్కాయి. అనేకమంది భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయించి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మైసమ్మ గారి సేవలను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు.

మైసమ్మ అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మైసమ్మ లేకపోయినా, వారు చూపిన ఆశయాల బాటలో పయనిస్తూ ప్రజా పోరాటాలను కొనసాగిస్తాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయన్న (వర్ధన్నపేట మండల కార్మిక సంఘం), కొండేటి రామకృష్ణ (నగర కార్యదర్శి), కోండేటి స్టాలిన్, గౌతమ్, తినినే ప్రభాకర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# సత్తుపల్లి, వేంసూర్ మండలాల్లో ఉద్యాన పంటల పరిశీలన

## రైతులకు సూచనలు చేసిన జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎం.వి. మధుసూదన్





**సత్తుపల్లి/ ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మండలంలోని గంగారాం, మేడిశెట్టివారిపాలెం గ్రామాల్లో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ పలు ఉద్యాన పంటలను పరిశీలించారు. కొబ్బరి తోటల్లో కోకో అంతర పంటగా సాగు చేసిన విధానాన్ని, అలాగే మకాడామియా నట్ తోటలను సందర్శించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు.

మేడిశెట్టివారిపాలెం గ్రామంలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలించిన సందర్భంగా తెల్ల దోమ ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. దానికి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, సమయానికి నియంత్రణ చర్యలు తీసుకుంటే దిగుబడి తగ్గకుండా కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు.

అనంతరం వేంసూర్ మండలంలోని యెర్రగుంటపాడు, రాయుడుపాలెం గ్రామాల్లో ప్లాస్టిక్ మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిరప, టమాటా తోటలను పరిశీలించారు. అలాగే శాశ్వత పందిరి విధానంలో సాగు చేస్తున్న సొర పంటను సందర్శించి, ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

ఉద్యానశాఖ పథకాల ద్వారా లబ్ధి పొందుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సాంకేతిక అధికారి అనితశ్రీ, సత్తుపల్లి ఉద్యాన అధికారి శ్రావణి, రైతులు గడ్డం సంజీవరెడ్డి, రవీందర్ రెడ్డి, కలపాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**ఐనవోలు/ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త);** అప్పుల బాధ తాళలేక ఓ గీత కార్మికుడు, రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాంనగర్ గ్రామానికి చెందిన కన్న గౌరీ (39), గౌడ కులస్తుడు. వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ, తాటి చెట్ల నుంచి కల్లు గీస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే, వ్యవసాయం కోసం తీసుకున్న అప్పులు తీర్చలేక కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే, ఫిబ్రవరి 20న సాయంత్రం 4 గంటల సమయంలో తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన భార్య స్రవంతి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ఐదు రోజుల పాటు చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం గౌరీ మృతి చెందాడు. మృతుని భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐనవోలు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. గీత కార్మికుడి మృతితో రాంనగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# విద్యార్థులకు మేధోమథనం.. చెస్ బోర్డుల పంపిణీ



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త);** విద్యార్థులలో ఏకాగ్రత, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు చెస్ నెట్వర్క్ సంస్థ ముందుకొచ్చింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు చెస్ బోర్డులను పంపిణీ చేసి, క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు కృషి చేసింది. ఈ కార్యక్రమానికి చెస్ నెట్వర్క్ గ్లోబల్ ఫౌండర్, ఆర్గనైజర్ కొదాటి సుధీర్ సారథ్యం వహించారు. స్వర్గీయ ఎల్లంకి చలపతిరావు జ్ఞాపకార్థం, వారి కుమారుడు ఎల్లంకి శశిధర్ అందించిన ఆర్థిక సహకారంతో, కెనడా చెస్ నెట్వర్క్ విభాగం సమన్వయంతో మొత్తం 126 చెస్ బోర్డులు, కాయిన్స్ మరియు శిక్షణ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక చెస్ బోర్డు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెస్ నెట్వర్క్ ఫౌండర్ కొదాటి సుధీర్ మాట్లాడుతూ.. "నేటి తరం పిల్లలు సెల్ ఫోన్లు, డిజిటల్ వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ స్థితి నుండి పిల్లలను బయటకు తెచ్చి, వారిలో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చదరంగం క్రీడను ఒక ఆయుధంగా వాడుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా

ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట గ్రామ ప్రముఖులు అల్లమనేని మోహన్ రావు మాట్లాడుతూ చదరంగం కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఇది ఒక మేధో క్రీడ. సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో, సరైన సమయంలో ఎలా నిర్ణయాలు తీసుకోవాలో ఈ ఆట నేర్పుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభివృద్ధికి ఎన్నారైలు చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ మామునూరు శ్రీధర్ అధ్యక్షతన జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ గంప అశోక్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రంపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

## మాస్ కాపీయింగ్‌కు కట్టడిడ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోండి



**రాయపర్తి/ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణపై మండల తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పరీక్షా కేంద్రానికి అనూహ్యంగా చేరుకున్న ఆయన హాల్ టికెట్ల పరిశీలన, ప్రశ్నపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా కొనసాగాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు అసలు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా, క్రమశిక్షణతో పరీక్షలు రాయాలని సూచించారు. స్వయంకృషి, నిబద్ధతే విజయానికి మార్గమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఆదేశించారు.

# హామీని అమలు పరిచిన సర్పంచ్ అనిత నర్సింగారావు.

## ఆడపిల్ల పెల్లికి సర్పంచ్ రూ,5116 లు కానుక.

## ఆదర్శ దంపతులుగా సర్పంచ్ అనితనర్సింగారావు. -హర్యం వ్యక్తం చేస్తున్న మండలప్రజలు,



**వేలేరు/ఫిబ్రవరి25 (జర్నలిస్ట్ వార్త);** సర్పంచ్ ఎన్నికల సమయంలో ఆడపిల్ల పెల్లికి రూ.5116 ఇస్తానని హామీ ఇచ్చిన సర్పంచ్ మరిజె అనిత నర్సింగారావు బుధవారం వేలేరు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన జల్తారు రమేష్ కుమార్తె మమత వివాహం ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్లో జరుగగా ఈవేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి రూ.5116 కానుకను ఇచ్చి ఇచ్చిన హామీని నేరవేర్చారు. ఈసందర్భంగా అనితనర్సింగారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ ఆడపిల్ల పెల్లికి రూ.1,00116 (ఒక లక్ష నూట పదహార్లు) ఇవ్వడం ప్రాంబించారు అలాగే పీచర గ్రామంలోని ప్రతిఆడపిల్ల పెల్లికి రూ.5116 లు సర్పంచ్ గా పదవిలో ఉన్నంతకాలం నాగౌరవవేతనాన్ని సైతం ఇస్తానని తెలుపుతూ పీచర గ్రామ అభివృద్ధికోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారిగా అమలు చేస్తున్నానని తెలిపారు.

**..హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు...**

ఆడపిల్ల పెల్లికి గ్రామసర్పంచ్ అనితనర్సింగారావు మేనమామలాగా రూ.5116 ఆర్థిక సహాయం చేయడం హర్షించదగ్గ విషయంగా మండలప్రజలు భాచిస్తూ అనితనర్సింగారావు ఆదర్శ దంపతులుగా కొనియాడబడుతున్నారు. ఇకార్యక్రమంలో సర్పంచ్ అనితనర్సింగారావు, ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్,మాజీకో ఆప్షన్ సభ్యుడు జాని, వార్డు సభ్యులు గ్రామస్తులు బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. తన పదవీకాలం పొడిగించినందుకు ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# యువనేత నాగెల్లి సురేష్ మృతికి నివాళులర్పించిన మార్నేని రవీందర్ రావు



**వర్ధన్నపేట/ఫిబ్రవరి25(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణానికి చెందిన యువజన నాయకుడు నాగెల్లి సురేష్ అనారోగ్యంతో అకాల మరణం చెందడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సమాచారం తెలుసుకున్న టేస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు , సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం రవీందర్ రావు మాట్లాడుతూ, సురేష్ మరణం వర్ధన్నపేట యువజన రంగానికి తీరని లోటని అన్నారు. చురుకైన యువ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సురేష్ సన్నిహితులు, భారీ సంఖ్యలో యువకులు పాల్గొని తమ ప్రియతమ నాయకుడికి కన్నీటి నివాళులర్పించారు.


# చెన్నారావుపేటలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

## : అభివృద్ధి ముసుగులో ఫిరాయింపుల పర్వం

**నర్సంపేట/ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట రాజకీయ క్షేత్రం ప్రస్తుతం అనూహ్య మలుపులు తిరుగుతోంది. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉండి, అధికార పార్టీ విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన నాయకులే, నేడు అదే పార్టీ కండువా కప్పుకోవడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలు కేవలం పార్టీ మార్పుగానే కాకుండా, 'రాజకీయ నైతికత' మరియు 'అభివృద్ధి' మధ్య ఉన్న సన్నని గీతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

### వెన్నుపోటు రాజకీయమా? వ్యూహాత్మక అడుగులా?

గతంలో ఏ పార్టీలో ఉండి పదవులు అనుభవించారో, ఇప్పుడు అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి అధికార పార్టీలో చేరడం కార్యకర్తల్లో తీవ్ర అసహనానికి దారితీస్తోంది. నిన్నటి వరకు తాము నమ్మిన నాయకులు, తమ కోసం పోరాడిన వారే ఇప్పుడు పక్క పార్టీ గూటికి చేరడంతో, క్షేత్రస్థాయి కార్యకర్తలు తమని తాము మోసపోయినట్లు




భావిస్తున్నారు. ఈ ఫిరాయింపుల వెనుక ప్రజల సంక్షేమం కంటే, రాజకీయ ఉనికిని కాపాడుకోవడం, వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అభివృద్ధి - ఒక రాజీపడని వాదన

అభివృద్ధి కోసం అధికార పార్టీలోకి వెళ్లడం తప్పా? అని నాయకులు ప్రశ్నిస్తుండగా, ప్రజలు మాత్రం దీనిని రాజకీయ అవకాశవాదంగానే చూస్తున్నారు.

రాజకీయ విశ్లేషణ: సిద్ధాంతపరమైన రాజకీయాలు కనుమరుగై, వ్యాపార పూరిత రాజకీయాలు పెరగడానికి ఇటువంటి ఫిరాయింపులే నిదర్శనం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. అయితే, పార్టీ మారితేనే అభివృద్ధి జరుగుతుందనే సంకేతం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీలోకి వెళ్లడం వల్ల కేవలం నాయకులకు మాత్రమే మేలు జరుగుతుందే తప్ప, సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనే గ్యారెంటీ ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రజల మౌనం.. లోతైన ఆవేదన

రాజకీయ నాయకుల ఈ గందరగోళ ప్రయాణం సామాన్యుడిని గందరగోళానికి గురిచేస్తోంది. మేము ఓట్లు వేసి గెలిపించింది ఒక పార్టీకి, ఇప్పుడు మా నాయకులు మరొక పార్టీకి మద్దతు తెలుపుతున్నారు. మా ఆశలు, ఆకాంక్షలు గాలిలో కలిసిపోయినట్లేనా? అని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

